# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 26 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4


## రేపటి నుంచి 50 శాతం సుంకాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అమెరికా ప్రస్తుత సుంకాలను రెట్టింపు చేయాలని ప్రకటించిన నేపథ్యంలో బుధవారం (ఆగస్టు 27) నుంచి అమెరికాకు ఎగుమతయ్యే భారతీయ వస్తువులపై 50 శాతం సుంకం అమల్లోకి రానుంది. ఈ నిర్ణయం భారతీయ ఎగుమతిదారులపై భారీ ఆర్థిక భారాన్ని మోస్తుందని పరిశ్రమలు హెచ్చరిస్తున్నాయి. ప్రభావిత రంగాల్లో వ్యవసాయం, ఫార్మా, జౌళి, చర్మ ఉత్పత్తులు మొదలైనవి ప్రధానంగా ఉంటాయి. ప్రత్యేకంగా ఎగుమతులపై ఆధారపడిన చిన్న మరియు మధ్యతరహా సంస్థలు ప్రధానంగా ప్రభావితమవుతాయని అధికారులు తెలిపారు. భారత ఎగుమతిదారుల భరోసా కోసం ప్రధానమంత్రి కార్యాలయం మంగళవారం ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి అధ్యక్షత వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశంలో ఎగుమతిదారులకు తక్షణ సహాయ చర్యలు, భవిష్యత్తు వ్యూహాలను చర్చించడం ప్రధాన ఉద్దేశ్యం. ప్రభావిత పరిశ్రమలకు ఎలాంటి భరోసా కల్పించాలో, ఎస్‌ఎంఈ స్‌కి ఎదురయ్యే ఆర్థిక భారాన్ని తగ్గించే మార్గాలను విధానం రూపకల్పన ద్వారా తక్షణమే అమలు చేయాలని చర్చించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ టారిఫ్ అమలు వల్ల కొన్ని రంగాలపై దీర్ఘకాల ప్రభావం ఉండొచ్చని పరిశీలన జరుగుతోంది.

## ఓయూను ప్రపంచంలోనే

# అద్భుతమైన విద్యాలయంగా తీర్చిదిద్దాలి

- డిసెంబర్‌లో మీటింగ్ పెట్టండి..మళ్లీ వస్తా
- మీకు కావాల్సిన నిధులు మంజూరు చేస్తా
- యూనివర్సిటీ అభివృద్ధిని అడ్డుకునే వారిని ఓడించండి
- బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఓయూను బతకనివ్వదు
- 15 రోజుల్లో కోదండరామ్‌కు మళ్లీ ఎమ్మెల్సీ
- ఓయూలో వివిధ శంకుస్థాపన కార్యక్రమాల్లో సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ చరిత్రకు సజీవ సాక్ష్యమైన ఉస్మానియా యూనివర్సిటీ ని ప్రపంచంలోనే ఒక అద్భుతమైన విద్యాలయంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు చెప్పారు. తెలంగాణ చరిత్రను నిక్షిప్తం చేసిన, తెలంగాణ పదానికే ప్రత్యామ్నాయంగా నిలిచిన ఉస్మానియా విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎంత చేసినా తక్కువే అవుతుందని అన్నారు. వర్సిటీలో విద్యార్థుల కోసం నూతన హాస్టల్ భవనాలు, రీడింగ్ రూమ్ నిర్మాణాలకు శంకుస్థాపన, కొత్తగా నిర్మించిన దుందుభి, భీమ హాస్టల్ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. ఆర్ట్స్ కాలేజీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో సీఎం మాట్లాడారు.

ఓయూను ఒక అద్భుతమైన వర్సిటీగా తీర్చిదిద్దడానికి ఇంజనీరింగ్ నిపుణులు, విద్యా శాఖ నిపుణలతో ఒక కమిటీని నియమించి సమగ్రమైన అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వర్సిటీల ప్రమాణాలను మించి ప్రపంచంతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దడానికి ఎన్ని నిధులైనప్పటికీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ కాలగర్భంలో కలవొద్దు. ఈ వర్సిటీ చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలవాలి. ప్రపంచ ప్రమాణాలతో అద్భుతమైన వర్సిటీగా రూపొందించడానికి ఏం కావాలో అడగండి. రాష్ట్ర సాధనలో ముందు భాగంలో నిలబడిన ఈ యూనివర్సిటీని గాలికొదిలేయడం సరికాదు. వర్సిటీలు ఉద్యోగులు, అధికారులను ఉత్పత్తి చేయడానికి మాత్రమే కాకుండా తెలంగాణ పునర్నిర్మాణానికి అవసరమైన మేధాసంపత్తిని అందిస్తుందని ఆశిస్తున్నాం. వర్సిటీలు చదువులకు మాత్రమే పరిమితం కాకుండా పరిశోధనలకు వేదిక కావాలి. సైద్ధాంతికపరమైన భిన్నాభిప్రాయాలపై చర్చలు జరగాలి.

అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. ఉపాధ్యాయ నియామకాల కోసం కేవలం 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించాం. వచ్చే ఆరు నెలల్లో ఇంకో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. అధికారం చేపట్టి రెండున్నరేళ్ల కాలం నాటికి లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తాం. ప్రైవేటు రంగంలో వేల కోట్ల పెట్టుబడులను తేవడమే కాకుండా 1.5 లక్షల ఉద్యోగాలు ప్రైవేటు రంగంలో కల్పించాం. అపోహలకు లోను కావద్దు. అనుమానాలు ఉంటే నివృతి చేస్తాం. అబద్ధాలను నమ్మకండి. కొందరు జీర్ణించుకోలేక ప్రతిదానికి అడ్డుపడుతున్నారు. అలాంటి వారు తెలంగాణ సమాజానికి ముసుగేసుకున్న చెదల్లాంటి వారు. ఉస్మానియా వర్సిటీని ఉంచకూడదని, ఎవరూ చదువుకోవద్దని కోరుకునే వారు. 2034 నాటికి తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలంటే మీరంతా చదువుకోవాలి. చదువు ఒక్కటే ఈ సమాజాన్ని మార్చగలదు..” అని ముఖ్యమంత్రి సవివరంగా మాట్లాడారు.

తెలంగాణ, ఉస్మానియా రెండూ అవిభక్త కవలల్లాంటివి. 1938 సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదిన గడ్డ ఇది. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన శివరాజ్ పాటిల్, పీవీ నర్సింహారావు ఈ యూనివర్సిటీ విద్యార్థులే. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన జైపాల్ రెడ్డి ఇక్కడ చదువుకున్న వారే. తెలంగాణ నలుమూలలా ఏ సమస్య వచ్చినా మొదట చర్చ జరిగేది ఈ యూనివర్సిటీలోనే. చదువుతోపాటు పోరాటాన్ని నేర్పించే గడ్డ ఇది. కొంతమంది రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం చేతులెత్తేసినప్పుడు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఈ విశ్వవిద్యాలయం ముందుకు తీసుకెళ్లింది. మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారి ఈ యూనివర్సిటీకి చెందిన విద్యార్థే. ఎంతో మంది మేధావులను అందించిన ఘన చరిత్ర ఉస్మానియా యూనివర్సిటీ సొంతం” అని సీఎం కొనియాడారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఈ విద్యాలయాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరిగిందని ఆరోపించారు. దీనికి పూర్వ వైభవం తీసుకువస్తామని ప్రకటించారు. ఆ క్రమంలోనే చదువుకుని చైతన్యం ఉన్న వారిని వీసీలుగా నియమించామని గుర్తు చేశారు. 108 ఏండ్ల చరిత్రలో దళితుడు వైస్ ఛాన్సలర్ కాలేదనీ,. ప్రస్తుతం తమ ప్రభుత్వం దళితుడిని వీసీగా నియమించిందని పేర్కొన్నారు.

మిగితా 2వ పేజీలో

## కేంద్రం అసమర్థత కారణంగానే

# యూరియా కొరత

- ఇప్పటివరకు 7.32 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ
- దేశవ్యాప్తంగా యూరియా కొరత
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రైతులకు బహిరంగ లేఖ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రైతాంగానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థత కారణంగానే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందంటూ లేఖలో తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా సరఫరాలో కేంద్రం ఘోరంగా విఫలమైందని లేఖలో ఆరోపించారాయన.

కేంద్ర ప్రభుత్వ అసమర్థతతో దిగుమతి యూరియా రాలేదు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా సరఫరాలో ఘోర వైఫల్యం చెందింది. రైతులకు ఇప్పటివరకు 7.32 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశాం. ఆగస్టు వరకు రాష్ట్రానికి 3.94 లక్షల మెట్రిక్ టన్నుల దిగుమతి యూరియా కేటాయించారు. అందులో కేవలం 2.10 లక్షల మెట్రిక్ టన్నులే సరఫరా చేయడం జరిగింది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో 78 రోజులు ఉత్పత్తి నిలిచిపోవడంతో యూరియా రాలేదు. రాష్ట్రానికి 1.69 లక్షల మెట్రిక్ టన్నుల కేటాయింపులో 1.07 లక్షలే సరఫరా చేశారు. మొత్తం 2.58 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఏర్పడింది. కేంద్ర వైఫల్యాన్ని రాష్ట్రంపై నెట్టాలని చూస్తున్నారు. దేశవ్యాప్తంగా యూరియా కొరత ఉంది. కానీ, తెలంగాణలో మాత్రమే యూరియా కొరత ఉన్నట్లు బీజేపీ నేతలు అబద్ధాలు చెబుతున్నారు.’ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన లేఖలో ఆరోపించారు.

రైతుల ముసుగులో బీఆర్ఎస్ ప్రేరేపిత ఆందోళనలు చేస్తున్నారు. యూరియా క్యూలైన్లపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం జరుగుతోంది. నానో యూరియా వినియోగం పెంచితే రైతులకు మేలు జరుగుతుంది. కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలని కేంద్రానికి డిమాండ్ చేస్తున్నాం. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు భరోసా కల్పిస్తాం. రాష్ట్రానికి రావాల్సిన యూరియా తెప్పించేందుకు ఎంతవరకైనా పోరాడతాం.’ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన లేఖలో పేర్కొన్నారు.

## పర్యావరణహితంగా గణేశ్ చతుర్థి జరుపుకోవాలి

**సమాచార పౌర సంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పర్యావరణానికి హానిచేయని మట్టితో తయారైన వినాయక విగ్రహాలనే పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సమాచార పౌరసంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక కోరారు. సోమవారం సమాచారశాఖ కార్యాలయంలో ఉద్యోగులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గణేశ్ చతుర్థి పదిరోజుల పాటు జరిగే ముఖ్యమైన పండుగ అని పేరొన్నారు. రసాయనాలు, పీవోపీతో తయారు చేసిన గణపతి విగ్రహాలను వాడటం వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు సంచాలకులు డీఎస్ జగన్, జాయింట్ డైరెక్టర్లు డీ శ్రీనివాస్, కే వెంకటరమణ, సీఐఈ రాధాకిషన్, డిప్యూటీ డైరెక్టర్లు ఎం మధుసూదన్, సీ రాజారెడ్డి, సమాచారశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నేషనల్ టీచర్స్ అవార్డ్స్ 2025కు ఎం.పవిత్ర ఎంపిక

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



నేషనల్ టీచర్స్ అవార్డ్స్ -2025కు తెలంగాణకు చెందిన టీచర్ ఎం.పవిత్ర ఎంపికయ్యారు. కేంద్ర విద్యాశాఖ జాతీయ స్థాయిలో ఇచ్చే పురస్కారానికి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 45 మందిని ఎంపిక చేసింది. తెలంగాణ నుంచి అవార్డు కోసం సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఎం.పవిత్రను ఎంపిక చేశారు. అవార్డును సెప్టెంబర్ 5న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించే ఉత్సవంలో అందజేయనున్నారు. ఈ అవార్డుతో పాటు ప్రశంసా పత్రం, రూ.50 వేల నగదు, సిల్వర్ మెడల్‌ను అందజేస్తారు.

## సర్కారు ఒక్క ప్రాజెక్ట్ పూర్తి చేయలే



- బీఆర్ఎస్ హయాంలో నిర్మిత భవనాలు, ఫ్లైఓవర్‌లు ప్రారంభిస్తున్న రేవంత్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణకు మోసం చేస్తున్నాయి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అధికారంలోకి వచ్చి 20 నెలలు దాటినా రేవంత్ సర్కారు ఒక్క ప్రాజెక్టు కట్టలేదని, ఒక్క గొప్ప పథకం అమలు చేయలేదని, బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన భవనాలు, ప్రాజెక్టులు, ఫ్లై ఓవర్లకు రిబ్బన్ కట్ చేసేందుకు రేవంత్‌రెడ్డి కత్తెర పట్టుకొని తిరుగుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దెప్పిపొడిచారు. ఓయూలో ఈ రోజు ప్రారంభించిన భవనాలు కూడా కేసీఆర్ హయాంలో నిర్మించినవేనని గుర్తుచేశారు. బడా మోదీ.. చోటా మోదీ కలిసి లోపాయికారి ఒప్పందంతో తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్నారని, కాంగ్రెస్, బీజేపీ కలిసి రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్ పరస్పర సహకారంతో తెలంగాణ ప్రజలకు ధోకా చేస్తున్నారని, ఇందులో భాగంగానే అదానీకి రేవంత్‌రెడ్డి అండగా నిలుస్తుంటే రాహుల్‌గాంధీ మాత్రం అమాయకంగా ఆటలో అరటిపండులా నిస్సహాయ స్థితిలో చోద్యం చూస్తున్నారని దుయ్యబట్టారు.

రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని బీజేపీకి వ్యతిరేకంగా రాహుల్ పోరాటం చేస్తుంటే.. ఇక్కడేమో రేవంత్‌రెడ్డి మోదీకి అండగా నిలుస్తున్నారని విమర్శించారు. బీజేపీ ఎంపీకి రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు ఫోర్త్‌సిటీ కాంట్రాక్ట్ కట్టబెట్టడమే ఇందుకు నిదర్శనమని స్పష్టంచేశారు. రెండు పార్టీల నుంచి చెరో ఎనిమిది మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి ఒరిగింది శూన్యమని నిప్పులు చెరిగారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆర్మూర్‌కు చెందిన బీజేపీ నేత ఆలూరు విజయభారతి పెద్దసంఖ్యలో తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రం నుంచి రూ.3 వేల కోట్ల విలువైన కేన్స్, రూ.8 వేల కోట్ల విలువైన మైక్రాన్ పరిశ్రమలను కేంద్రంలోని బీజేపీ గుజరాత్‌కు తన్నుకుపోయి తెలంగాణ నిరుద్యోగ యువతకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. మహేశ్వరంలో ఏర్పాటు చేయాల్సిన పరిశ్రమల పార్క్‌ను తన భాగస్వామి పార్టీ అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు తరలించిందని, నవోదయ పాఠశాలల మంజూరులోనూ అన్యాయం చేసిందని, జిల్లాకోటి ఇవ్వాలని అడిగితే మొండిచెయ్యి చూపిందని నిప్పులు చెరిగారు. దేశంలో 157 మెడికల్ కాలేజీలు ఇచ్చి తెలంగాణకు ఒక్కటీ ఇవ్వకుండా ఇక్కడి విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లిందని, ఐఐఎం, కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ ఇవ్వకుండా మోదీ ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు.

బడే భాయ్-చోటే భాయ్ ఫెవికాల్ బంధంతో తెలంగాణ ప్రజల భవిష్యత్తు ప్రమాదంలో పడుతున్నదని వాపోయారు. ఇక్కడి బీజేపీ నేతలు రేవంత్ సర్కారు వైఫల్యాలను కప్పిపుచ్చుతూ రక్షణ కవచంలా నిలుస్తున్నారని తూర్పారబట్టారు. అంతర్గత ఒప్పందంతోనే కంచ గచ్చిబౌలి భూ కుంభకోణం, యూరియా సంక్షోభంపై రైతుబంధు కోత.. రుణమాఫీ ఎత్తివేత, తులంబంగారం ఎగ్గొట్టడంపై మాట్లాడటం లేదని, కానీ కేసీఆర్‌పై మాత్రం ఒంటికాలితో లేస్తున్నారని విమర్శించారు.

మిగితా 2వ పేజీలో

## వెండి ధర రికార్డు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బంగారం మాదిరుగానే వెండి ధర కూడా పరుగులు పెడుతోంది. సోమవారం కిలో వెండి ధర రూ.1000 పెరిగి రూ.1,21,000 కు చేరుకుంది. ఇక 24 క్యారెట్ల బంగారం రూ.1,01,660 గా ఉంది. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ (ఐబిజెఏ) ప్రకారం, ఆగస్టు 25న వెండి ధరలు కొత్త రికార్డు స్థాయికి చేరుకుంది. ఒక కిలో వెండి రూ.2,227 పెరిగి రూ.1,16,133కు చేరింది. గత శుక్రవారం వెండి ధర రూ.1,13,906గా ఉంది. బంగారం ధర కూడా పెరిగింది. కేడియా కమోడిటీ అంచనాల ప్రకారం, 2025 చివరినాటికి వెండి ధర కిలోకు రూ.1.30 లక్షలు తాకవచ్చు. మనీకంట్రోల్ అంచనా ప్రకారం, వెండి 34% పెరిగి రూ.1.46 లక్షల వరకు వెళ్లే అవకాశం ఉంది. సిటీగ్రూప్ నివేదిక మాత్రం ధర రూ.1.20 లక్షల నుంచి రూ.1.30 లక్షల మధ్యలో ఉండవచ్చని సూచిస్తోంది. అదే సమయంలో బంగారం ధర ఈ సంవత్సరం రూ.1.04 లక్షల వరకు పెరగవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోడల్ అధికారుల నియామకం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఎప్పుడైనా రాబోతుందన్న సిద్ధతలో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ ఏర్పాట్లు చేపట్టారు. ఉప ఎన్నిక సందర్భంలో అవసరమయ్యే వివిధ సేవలను సమర్థవంతంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించారు.

**నియమించిన నోడల్ అధికారులు:**

మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్: ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

ఈవీఎం, వీవీ వివిప్యాట్ నిర్వహణ: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌవన్

సిబ్బంది ట్రైనింగ్: ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్: చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ శ్రీనివాస్ చారి

మెటీరియల్ మేనేజ్‌మెంట్: అదనపు కమిషనర్ (అడ్మిన్) కె. వేణుగోపాల్

ఎంసీసీ: అదనపు ఎస్పీ (విజిలెన్స్ జీహెచ్ఎంసీ) ఎం. సుదర్శన్

లా అండ్ ఆర్డర్, వల్నరబుల్ మ్యాపింగ్, జిల్లా భద్రతా ప్రణాళిక: డీఎస్పీ నరసింహా రెడ్డి

ఎన్నికల వ్యయ పరిశీలన: చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ (జీహెచ్ఎంసీ) వెంకటేశ్వర్ రెడ్డి

ఎన్నికల పరిశీలన: అసిస్టెంట్ వెటర్నరీ అధికారి విల్సన్

డమ్మీ బ్యాలెట్ పేపర్: సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్

మీడియా కమ్యూనికేషన్, ఎంసీఎంసీ: సీపీఆర్ఓ సెక్షన్ పీఆర్ఓ ఎం. దశరథ్

సైబర్ సెక్యూరిటీ, ఐటీ, కంప్యూటరైజేషన్: జాయింట్ కమిషనర్ (ఐటీ) సి. రాధా

హెల్ప్‌లైన్, కంప్లైంట్ రీడ్రెస్సల్: ఐటీ (ఏఈ) కార్తీక్ కిరణ్

వెబ్‌కాస్టింగ్: ఐటీ (ఏఈ) తిరుమల కుమార్

## రూ. 100 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు చేరువలో ప్రధాన రహదారికి ఆనుకుని ఆక్రమణలకు గురైన భూమిని హైడ్రా కాపాడింది. 2 వేల చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమి విలువ దాదాపు రూ. 100 కోట్లవరకూ ఉంటుంది. రెండు దశాబ్దాలుగా అక్రమార్కుల చేతిలో కబ్జా అయిన భూమికి హైడ్రా సోమవారం విముక్తి కల్పించింది. జూబ్లీహిల్స్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీకి సంబంధించిన ఈ భూమి లే ఔట్ ప్రకారం ప్రజావసరాలకు ఉద్దేశించినది. అయితే పిల్లా సత్యనారాయణ అనే వ్యక్తి ఆక్రమించి నకిలీ (తప్పుడు) ఇంటి నంబరను సృష్టించి అందులో నర్సరీ నడుపుతున్నాడు. గతంలో సత్యనారాయణపై జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. జీహెచ్ఎంసీ పలుమార్లు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేసింది. ఆక్రమణకు పాల్పడిన సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించాడు. కోర్టును కూడా తప్పుదోవ పట్టించి స్టేటస్‌కో కూడా తెచ్చుకున్నాడు. స్టేటస్‌కో ఉండగా, అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. నర్సరీ నడపరాదు. కానీ.. అక్కడ అనుమతి లేని షెడ్డుల నిర్మాణాలు, నర్సరీతో వ్యాపారాన్ని నిర్వహించారు.

జూబ్లీహిల్స్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఈ అవకతవకలపై హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టారు. లే ఔట్ ప్రకారం ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలంగా నిర్ధారించారు. నర్సరీ నడుపుతున్న సత్యనారాయణకు హైడ్రా నోటీసులిచ్చింది. ఈ నోటీసులపై తిరిగి హైకోర్టును ఆశ్రయించిన సత్యనారాయణకు అక్కడ చుక్కెదురైంది. గతంలో ఉన్న స్టేటస్‌కోను కూడా కొట్టేసి హైడ్రా తీసుకోబోయే చర్యలకు హైకోర్టు అనుమతిచ్చింది. కోర్టు ఆదేశాలతో సోమవారం ఉదయం జూబ్లీహిల్స్‌లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. అంతకుముందు నర్సరీలో మొక్కలను తరలించుకునేందుకు అవకాశం కల్పించారు. అనంతరం అక్కడ షెడ్డులతో పాటు ఆక్రమణలను హైడ్రా తొలగించింది. దీంతో 2000 గజాల స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు పేర్కొంటూ బోర్డులు పెట్టింది. జూబ్లీహిల్స్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు రవీంద్రనాథ్‌తో పాటు, పాలకమండలి సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సుదీర్ఘంగా తాము చేస్తున్న న్యాయపోరాటం ఫలించిందని పేర్కొన్నారు. రూ. వంద కోట్ల ల్యాండ్‌ను కబ్జా దారుల నుంచి విడిపించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తోపాటు, జీహెచ్ఎంసీ అధికారులకు, సొసైటీ ప్రెసిడెంట్ తో పాటు పాలకమండలి సభ్యులు కతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులను ముందస్తు అరెస్టులు చేయటమేంటి?

**మాజీ మంత్రి హరీశ్‌రావు**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సీఎం రేవంత్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి వస్తున్న సందర్భంగా విద్యార్థులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామిక చర్య అని మాజీ మంత్రి టి హరీశ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అరెస్టయిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను అరెస్టు చేసేందుకేనా విద్యాశాఖను, హోం శాఖను తమ వద్ద పెట్టుకున్నది? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మీరిచ్చిన మోసపూర్తి హామీల గురించి నిలదీస్తున్నారనీ, వారిపై కూడా నిషేదాజ్ఞలు విదిస్తారా? అని నిలదీశారు. ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పాలన అని చెప్పి, ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెల్లుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏమీ చేయలేదని విమర్శించారు. 22నెలల్లో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. మోసం చేసినందుకు ఉస్మానియా సాక్షిగా విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



## బాలాపూర్ గణేష్ ఉత్సవాలకు రండి

బాలాపూర్ గణేష్ నవరాత్రి ఉత్సవాలకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఆహ్వానించింది. సీఎంను ఆహ్వానించేందుకు సోమవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గల ముఖ్యమంత్రి ఇంటికి బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి చైర్మెన్ నిరంజన్‌రెడ్డి, తదితరులు వెళ్లారు. సీఎంతో భేటీ అయ్యారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలకు రావాలని సీఎంను ఆహ్వానించారు.


## మధ్యాహ్న భోజనం వికటించి 21 మంది విద్యార్థులు అస్వస్థత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మధ్యాహ్న భోజనం వికటించి 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం షెట్లూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం ప్రకారం.. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఉడికీ ఉడకని అన్నంతో మిల్‌మేకర్ కూరతో భోజనం వడ్డించారు. అన్నం తిన్న గంట తర్వాత 21 మంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు అయ్యాయి. గమనించిన ఉపాధ్యాయులు హుటాహుటిన బిచ్కుంద ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆందోళనకుగురైన విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడికి చేరుకున్నారు. బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి దవాఖానకు రాగా, తల్లిదండ్రులు, గ్రామస్థులు సమస్యలు ఏకరవు పెట్టారు. పాఠశాలకు సరఫరా చేసే బియ్యంలో పురుగులు వస్తున్నాయని తెలిపారు. సరైన నీటి సౌకర్యం లేక మిషన్ భగీరథ నీటితో మధ్యాహ్న భోజనం వండుతున్నారని, ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రంగు మారి వస్తున్నాయని తెలిపారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీని మార్చాలని సబ్‌కలెక్టర్ డీఈవో రాజును ఆదేశించారు. అనంతరం విద్యార్థులను పరామర్శించారు. వారికి మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

## బోయినిపల్లి ఎస్సైగా రమాకాంత్ బాధ్యతలు

- మండలంలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా నేరుగా పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలి..
- ఎస్.ఐ రమాకాంత్




**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల ఎస్సైగా రమాకాంత్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేయగా, ఆదివారం బోయినిపల్లి ఎస్సైగా పదవి బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ పనిచేసిన ఎస్సై రాజ్ కుమార్ ను డిసిఆర్బికి బదిలీ చేయగా,గంభీరావుపేటలో పనిచేస్తున్న రమాకాంత్ బోయినిపల్లికి బదిలీపై వచ్చారు. 2018 బ్యాచ్ కు చెందిన ఎస్.ఐ రమాకాంత్ జిల్లాలో సిరిసిల్ల కోనరావుపేట,ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేటలో ఎస్.ఐగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ రమాకాంత్ మాట్లాడుతూ.. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షించడానికి కృషి చేస్తానని, శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అక్రమ వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మండలంలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్న నేరుగా పోలీసు స్టేషన్ లో సంప్రదించాలన్నారు.



## సురవరంకు ఎంపీ వద్దిరాజు ఘన నివాళులు..

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) అగ్ర నాయకులు, మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఘనంగా నివాళులర్పించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సురవరం శుక్రవారం రాత్రి కన్నుమూసిన విషయం తెలిసిందే. స్వర్గీయ సుధాకర్ రెడ్డి కోరిక మేరకు ఆయన భౌతికకాయాన్ని ఆదివారం గాంధీ వైద్య కళాశాలకు అప్పగించారు. దివంగత నాయకుని అంతిమయాత్రలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి వచ్చిన ఎంపీ రవిచంద్ర, గాంధీ వైద్య కళాశాల వద్ద సురవరం పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన సురవరం కుటుంబ సభ్యులను, సీపీఐ శ్రేణులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి సేవలను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కొనియాడారు.

## ఓయూను ప్రపంచంలోనే అద్భుతమైన విద్యాలయంగా తీర్చిదిద్దాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సమాజాన్ని చైతన్యపరిచే మేధా సంపత్తి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి రావాలని ఆకాంక్షించారు. దేశానికి యువ నాయకత్వం అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. “దేశంలో 60 శాతం జనాభా 35 ఏండ్ల లోపు వారే. ఇది మన దేశ సంపద. 21 ఏండ్ల వయసులో ఐఏఎస్‌లు దేశానికి సేవలందిస్తున్నప్పుడు... శాసనసభలో అడుగు పెట్టేందుకు 35 ఏండ్ల వయోపరిమితి ఎందుకు?” అని సీఎం ప్రశ్నించారు. వయోపరిమితిని 21 ఏండ్లకు ఎందుకు తగ్గించకూడదో ఆలోచన చేయాలని కేంద్రానికి సూచించారు. యూనివర్సిటీలు చదువులకు మాత్రమే పరిమితం కాకుండా పరిశోధనలకు వేదిక కావాలని అన్నారు. “సైద్ధాంతికపరమైన భిన్నాభిప్రాయాలపై చర్చలు జరగాలి. సాంకేతిక పరమైన చర్చలు జరగాలి. వర్సిటీలు, విద్యాలయాల్లో సిద్ధాంతపరమైన పోరాటాలు, సామాజిక చైతన్య ఉద్యమాలు లేని కారణంగా చిన్న చిన్న కాలేజీల్లో కూడా విద్యార్థులు గంజాయి సేవించడం లాంటి వ్యసనాల బారిన పడుతున్నారు. ఇది మంచి పరిణామం కాదు” అని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాలయాలు విద్యతో పాటు దేశానికి నాయకత్వం వహించే నిపుణులను తయారు చేయాలని ఆకాంక్షించారుఉస్మానియా యూనివర్సిటీలో పోలీసులు కనిపించొద్దని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. “నిరసన తెలిపే వారిని నిరసన తెలపనివ్వండి. నేను రావొద్దని అడ్డుకునే వారికి సమాధానం చెప్పే చిత్తశుద్ధి నాకుంది. కొంతమంది రాజకీయ నాయకులకు పదవులు పోయాయన్న ఆవేదన ఉంటుంది. వాళ్ల కొడుకులను ఏదో చేద్దామనుకుంటే ఏదో అవుతున్నారని బాధ ఉంటది. వారి ఉచ్చులో మీరు పడొద్దు. సమస్యలుంటే మాకు చెప్పండి. మా మంత్రులు మీకు అందుబాటులో ఉంటారు. డిసెంబర్‌లో ఆర్ట్స్ కాలేజీ వద్ద మీటింగ్ పెట్టండి. మళ్లీ యూనివర్సిటీకి వచ్చి అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తా.” అని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రొఫెసర్ కోదండరామ్‌పై కుట్ర చేసి సుప్రీంకోర్టుకు వెళ్లి ఆయన ఎమ్మెల్సీ పదవి తొలగించారని సీఎం ఆరోపించారు. మరో 15 రోజుల్లో ఆయన మళ్లీ ఎమ్మెల్సీ అవుతారని సీఎం స్పష్టం చేశారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఆయనకు తమ సర్కార్ సముచిత స్థానం కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. ఆయన పదవి పోయిందని కొంతమంది నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. “అపోహలకు లోను కాకండి. అబద్ధాల సంఘం చెప్పే మాటలు నమ్మొద్దు. వాట్సాప్, సోషల్ మీడియాలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సెంట్రల్ యూనివర్సిటీలో సింహాలు, ఏనుగులు ఉన్నాయని ప్రచారం చేసి అడ్డుకున్నారు. తెలంగాణలో సింహాలు, ఏనుగులు లేనేలేవు. మానవ రూపంలో ఉన్న మృగాలు ఉన్నాయి. వాళ్లు తెలంగాణ సమాజానికి పట్టిన చెదలు లాంటి వారు. అలాంటివారు మళ్లీ అధికారంలోకి వస్తే ఉస్మానియా యూనివర్సిటీని ఉండనివ్వరు” అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లు, యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, పలువురు ప్రజాప్రతినిధులు, యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, వివిధ విశ్వవిద్యాలయాల వైస్ చాన్సెలర్లు, తదితరులున్నారు.

# కేటీఆర్ రాజనీతిజ్ఞతకు దేశవ్యాప్త ప్రశంసలు..

- ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం..
- ఓపెన్‌ఏఐ సీఈఓకు హైదరాబాద్‌ను ఆహ్వానించిన తీరుపై నెటిజన్ల కితాబు..



**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకుడైనా, రాష్ట్ర ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి రుజువు చేశారు. కృత్రిమ మేధస్సులో ప్రపంచంలోనే అగ్రగామి సంస్థ అయిన ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్‌కు హైదరాబాద్‌ను ఆహ్వానించి, ఆయన ప్రదర్శించిన రాజనీతిజ్ఞతకు దేశవ్యాప్తంగా నెటిజన్ల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఓపెన్‌ఏఐ తమ మొదటి కార్యాలయాన్ని భారతదేశంలో ప్రారంభించనున్నట్లు సామ్ ఆల్ట్‌మన్ ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో పోస్ట్ చేయగా, కేటీఆర్ వెంటనే స్పందించారు. ఓపెన్‌ఏఐ కార్యాలయానికి హైదరాబాద్ అన్ని విధాలుగా అనువైన గమ్యస్థానమని ఆయన పేర్కొన్నారు. సాంకేతిక నిపుణుల లభ్యతతో పాటు, ఇక్కడ ఉన్న టీహబ్, వీహబ్, టీవర్క్స్, తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ వంటి వ్యవస్థలను ఆయన ఉదాహరించారు. అలాగే, మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, మెటా, యాపిల్ వంటి గ్లోబల్ టెక్ దిగ్గజాలకు హైదరాబాద్ ఎలా నిలయంగా మారిందో వివరించారు. తెలంగాణలో గత ప్రభుత్వాలు కృత్రిమ మేధస్సుకు ఎంతగా ప్రాధాన్యత నిచ్చాయో, 2020ని ‘ఏఐ సంవత్సరంగా’ ప్రకటించి, అనేక కార్యక్రమాలను చేపట్టాయని గుర్తు చేశారు. కేటీఆర్ నిష్పక్షపాత, తెలంగాణ ఫస్ట్ విధానాన్ని నెటిజన్లు విశేషంగా ప్రశంసించారు.రాజకీయాలకతీతంగా ఆయన వ్యవహరించిన తీరుపై వివిధ రాష్ట్రాల నుంచి కూడా ప్రశంసలు వచ్చాయి.

ఎక్స్ యూజర్ యోగేశ్ శర్మ స్పందిస్తూ, “అన్ని విభేదాలను పక్కనపెట్టి, ఒక ప్రతిపక్ష నాయకుడు తన రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాడు” అని ప్రశంసించారు. అవంతిక లోహర్ అనే నెటిజన్, “యూపీ మంత్రుల నుంచి మేము కోరుకునేది ఇదే. యోగి ఆదిత్యనాథ్ దీన్ని గమనించండి” అని వ్యాఖ్యానించారు. ఇండియన్ ట్రెండ్ ఎక్స్ అనే యూజర్, “ఖచ్చితంగా చెప్పారు. భారతదేశంలో ఓపెన్‌ఏఐ కార్యాలయానికి హైదరాబాద్ సరైన ప్రదేశం” అని పేర్కొన్నారు.

‘భారతీయనవేషక్’ అనే యూజర్ స్పందిస్తూ, “ఈ వ్యక్తి ఎన్నికల్లో ఓడిపోయి ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఆయన సందేశాన్ని చూడండి. అధికారంలో ఉన్నా, లేకున్నా మీ సొంత రాష్ట్రంలోని నాయకులతో దీన్ని పోల్చుకోండి. పార్టీలకు అతీతంగా ఉన్న సోకాల్డ్ జాతీయ నాయకులతో పోల్చుకోండి” అని పోస్ట్ చేశారు. నిరంకుష్ దాస్ అనే నెటిజన్, “ప్రతిపక్ష నాయకుడు తన రాష్ట్రానికి పెట్టుబడుల కోసం ప్రయత్నించడం ఇంతకుముందు బహుశా ఎప్పుడూ జరగలేదు” అని అభిప్రాయపడ్డారు.

విక్రమ్ మోహన్ స్పందిస్తూ, “వావ్! ప్రతిపక్షంలో ఉండి కూడా నగరం కోసం ప్రచారం చేస్తున్నారు. హ్యాట్సాఫ్” అని అభినందించారు. టి శ్రీకాంత్ అనే మరో నెటిజన్, “నిజమైన నాయకత్వం అంటే ఏమిటో మాకు చూపించినందుకు ధన్యవాదాలు. రాష్ట్రానికి ఎవరు నాయకత్వం వహించినా, రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల ప్రయోజనాలను కాపాడాలి. స్థిరమైన పాలనకు తెలంగాణ ఒక ఉదాహరణగా నిలవాలి” అని అన్నారు.

కేటీఆర్ ఆలోచనలు పార్టీ రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర, దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని నెటిజన్లు కొనియాడారు. ఆయన చూపుతున్న సమతుల్య, దూరదృష్టి గల నాయకత్వం భారతదేశపు కృత్రిమ మేధస్సు విప్లవంలో ఒక ఆశావాహ దృక్పథాన్ని నింపింది.

# సర్కారు ఒక్క ప్రాజెక్ట్ పూర్తి చేయలే

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో యూరియా కొరతకు ఆపరేషన్ సిందూర్ కారణమని బీజేపీ ఎంపీ వింత వాదనను తెరపైకి తెచ్చారని, అదే నిజమైతే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కొరత ఎందుకు లేదని ప్రశ్నించారు.

ఉత్తర, దక్షిణ తెలంగాణను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో కేసీఆర్ కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల నిర్మాణానికి అంకురార్పణ చేశారని గుర్తుచేశారు. 2014లో పాలమూరుకు జాతీయ హోదా ఇస్తామని అప్పటి కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ మహబూబ్‌నగర్ గడ్డపై మాటిచ్చారని, కానీ పదేండ్లు దాటినా జాతీయ హోదా గానీ, నయాపైసా గానీ ఇవ్వకుండా కేంద్రం నయవంచన చేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ వందలసార్లు విజ్ఞప్తులు చేసినా మోదీకి మనసురాలేదని, బీజేపీకి మన రాష్ట్ర రైతులపై ప్రేమలేదని, భవిష్యత్తులోనూ ఉండబోదని స్పష్టంచేశారు.

తెలంగాణ ప్రజలపై మొసలి కన్నీళ్లు కారుస్తున్న మోదీ ప్రభుత్వం విచిత్ర ప్రతిపాదన తెరపైకి తెచ్చిందని కేటీఆర్ మండిపడ్డారు. ‘గోదావరి నీళ్లను బనకచర్ల ద్వారా ఆంధ్రాకు తరలించి అక్కడి నుంచి కర్ణాటక మీదుగా కావేరీ ద్వారా తమిళనాడుకు తరలిస్తరట..తెలంగాణకేమో హిమాలయాల్లో కరిగే మంచు కొండల ద్వారా నీళ్లు ఇస్తరట.. పైసా ఇవ్వలేనోళ్లు మంచుకొండల నీళ్లు తెచ్చిస్తామంటే మనం నమ్మాలట! మళ్లీ బీజేపీకి ఓట్లేసి గద్దెనెక్కించాలట’ అని తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్న చందంగా రెండు పార్టీల నుంచి గెలిచిన పదహారు మంది ఎంపీలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రూ.1137 కోట్ల అమృత్ కాంట్రాక్ట్‌ను రేవంత్‌రెడ్డి తన బావమరిదికి అక్రమంగా కట్టబెట్టారని ఆధారాలతో ఫిర్యాదు చేసినా కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. ఎన్నిసార్లు అడిగినా దున్నపోతు మీద వాన పడ్డ చందంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు.

‘కాంగ్రెస్ ప్రభుత్వంలో బీజేపీ ఎంపీలకు కాంట్రాక్ట్.. ఢిల్లీలోనేమో రేవంత్ బావమరిదికి కాంట్రాక్టులు.. రెండు పార్టీల దోస్తానాకు ఇంతకుమించిన నిదర్శనం ఇంకేం కావాలి?’ అంటూ దుయ్యబట్టారు. సివిల్ సప్లయ్‌లో టెండర్ల కుంభకోణం జరిగిందని ఈడీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని విమర్శించారు. హెచ్‌సీయూ భూముల్లో రేవం త్‌రెడ్డి ప్రభుత్వం చెట్లను నరికేసి వన్యప్రాణు లను వధిస్తుంటే కేంద్రం పట్టించుకోలేదని, సుప్రీంకోర్టు కమిటీ వేసి 10 వేల కోట్ల కుంభకోణం జరిగిందని తేల్చినా మోదీ ప్రభుత్వం ఇంతవరకూ చర్యలు తీసుకోకపోవడంలోని ఆంతర్యమేమిటని నిలదీశారు.

హామీలు ఇవ్వడం.. ఎగ్గొట్టడంలో కేంద్రంలోని బడా మోదీ.. రాష్ట్రంలోరి చోటా మోదీ పరస్పరం పోటీపడుతున్నారని కేటీఆర్ ఎద్దేవాచేశారు. ‘మోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తా అన్నరు..చిన్నోడు కాబట్టి ఇక్కడ రేవంత్ ఏటా రెండు లక్షలు అన్నడు.. అక్కడ ఆయన ఇయ్యరు..ఇక్కడ ఈయన ఇవ్వరు..ఆయన పేదల ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామన్నరు.. ఈయనేమో రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తా అన్నరు.. ఆయనవి రావు..ఈయనవి పడవు..ఇద్దరూ విమర్శిస్తే ఊరుకోరు. ఆయన ఈడీని పంపుతడు..ఈయన ఏసీబీని పంపుతడు.. గట్టిగ మాట్లాడినోళ్లను జైలుకు పంపుతరు’ అని చురకలంటించారు. హామీలు అడిగితే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని కేసులతో భయపెడుతున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, సర్కారు వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని మరోసారి తేల్చిచెప్పారు.ఎన్నికల ముందు డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల పేరిట హామీల జాతరకు తెరలేపిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తర్వాత చెప్పుల జాతరకు తెరలేపిందని కేటీఆర్ దెప్పిపొడిచారు. ‘ఇప్పుడు ఎక్కడికెళ్లినా యూరియా కోసం కిలోమీటర్ల పొడవునా చెప్పుల లైన్లు దర్శనమిస్తున్నయి. కొత్త సినిమా రిలీజ్ అయినప్పుడు యువకులు ఉరికినట్టు ఇప్పుడు యూరియా కోసం రైతులు రాత్రింబవళ్లు క్యూలో నిల్చుంటున్నరు.. ఇది కాంగ్రెస్ తెచ్చిన మార్పు’ అని దుయ్యబట్టారు. ప్రజలు ఇప్పటికైనా ఆలోచించాలని, ఓట్ల ముందర ఆదమరిచినం కాబట్టే ఇప్పుడీ దుస్థితి దాపురించిందని వాపోయారు.తెలంగాణకు ద్రోహం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీకి స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. లేకుంటే తమకే ప్రజాబలం ఉన్నదని 2 పార్టీలు రెచ్చిపోయే ప్రమాదమున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ అంటే కేసీఆర్ అని.. కేసీఆర్ అంటే తెలంగాణ అని పునరుద్ఘాటించారు. తెలంగాణపై ఆయనకున్న కడుపునొప్పి ఇతర పార్టీల నేతల కూ ఉండదని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు సంఘటితమై ఊరూరా గులాబీ జెండా ఎగరేయాలని దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్‌కు వంతపాడుతున్న కొందరు అధికారులు, పోలీసులను వదిలిపెట్టబోమని, మళ్లీ వచ్చేది ముమ్మాటికీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తేల్చిచెప్పారు. కార్యకర్తలు సైతం అతిచేసే అధికారుల వివరాలను పింక్ బుక్కో, రెడ్ బుక్కో దేంట్లోనైనా నోట్ చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ పాలనలో అనేక గొప్ప పనులు చేసినా తాము చెప్పుకోలేదని, ఇదే అదనుగా అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అబద్ధాల జాతరకు తెరలేపారని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు అనరాని మాటలన్నారని చెప్పారు. ‘కేసీఆర్ కట్టిన ప్రగతి భవన్‌లో 150 గదులున్నయి.. బంగారు బాత్రూంలున్నయి.. అని పచ్చి అబద్ధాలు చెప్పిండ్రు. ఇదే విషయాన్ని ఇటీవల ఎదురుపడ్డ భట్టి విక్రమార్కను 150 రూంలల్లో ఏ రూంలో పడుకుంటున్నవని అడిగినా.. ఆయన సమాధానం చెప్పకుండా వెకిలి నవ్వులు నవ్వుతున్నరు’ అని ఎద్దేవాచేశారు. ‘అధికారం లోకి వస్తం వంద రోజుల్లో పథకాల వరద పారిస్తం..అని ఊదరగొట్టిండ్రు.మరి వంద రోజులు కాలేదా?’ అని ప్రశ్నించారు. ‘ఇక ఫ్రీ బస్సు అందం గురించి నేను చెప్పక్కర్లేదు..మీకందరికీ దాని గొప్పతనం తెలుసు’ అని ఎద్దేవా చేశారు.

ఐటీఐఆర్‌ను రద్దు చేసి, నేషనల్ డిఫెన్స్ కారిడార్‌కు మొండి చెయ్యి చూపి..మెడికల్ కాలేజీలు ఎగ్గొట్టి..కేన్స్, మైక్రాన్ లాంటి పరిశ్రమలను తరలించుకెళ్లి మోడీ సర్కారు మోసం చేస్తే.. అవ్వాతాతల రెట్టింపు పింఛన్ హామీకి ఎగనామం పెట్టి, ఆడబిడ్డలకు తులం బంగారం ఎత్తగొట్టి, జాబ్ క్యాలెండర్‌కు తిలోదకాలిచ్చి, రైతుబీమాకు కోతపెట్టి రేవంత్ ప్రభుత్వం దగా చేస్తున్నది.’ అన్నారు.

# అంతరాష్ట్ర ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్...




**-08 ద్విచక్ర వాహనాలు స్వాధీనం...**

**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టివి, రాజన్న సిరిసిల్ల**

అంతర్ రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగను అరెస్టు చేసి, ఎనిమిది చక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్కు తరలించినట్లు ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్టంలో ని ఈస్ట్ గోదావరి జిల్లా బిక్కవోలు మండలం వులుపల్లి గ్రామానికి చెందిన అంబటి రాంబాబు తెలుగు రాష్ట్రల్లో ఆన్లైన్ గేమ్స్/స్టాక్ మార్కెట్ లో పెద్దమొత్తంలో డబ్బులు పోగొట్టుకోగా ఎలాగైనా సులభ మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్టంలోని కాకినాడ లో 2019 సంవత్సరంలో ఒక ఇంటిలో దొంగతనికి పాల్పడగా అడ్డుగా వచ్చిన ఇద్దరు వ్యక్తులను హత్య చేయగా అట్టి హత్య కేసులో రిమాండ్,అనంతరం హైదరాబాద్ మకాం మార్చి ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నాడని అన్నారు.

గుంటూరు జిల్లా కి చెందిన మంద్రు నారాయణ యూనిమని లో చేస్తున్న ఉద్యోగ నిమిత్తం జూన్ నెలలో సిరిసిల్లకి వచ్చి వెళ్లే దారిలో వెంట్రవుపల్లి గ్రామంలో టిఫిన్ సెంటర్ ముందు వాహనం నిలిపి వెళ్లి, టిఫిన్ చేసి వచ్చే సరికి బైక్ లేకపోవడంతో బోయినపల్లి పోలీస్ స్టేషన్ లో నారాయణ పిర్యాదు చేయగా కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. దర్యాప్తు లో భాగంగా జిల్లా టాస్కోర్స్ ఇన్స్పెక్టర్ నటేష్,టాస్కోర్స్ సిబ్బంది, బోయినపల్లి పోలీస్ సిబ్బందితో టీమ్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేయగా సాంకేతికత ఆధారంగా హైదరాబాద్ లో రాంబాబు ను అదుపులోకి తీసుకొని విచారించగా నాలుగు సంవత్సరాలు 22 ద్విచక్ర వాహనాలు దొంగలించనని,నాపై హత్య కేసు,చీటింగ్ కేసులు ఉన్నాయని ఒప్పుకోగా,08 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. మిగతా వాహనాలు కూడా త్వరలో రికవరీ చేయడం జరుగుతుందని అన్నారు. ఇక్కడ టాస్కోర్స్ ఇన్స్పెక్టర్ నటేష్,ఎస్ఐ లు రమాకాంత్, శ్రీకాంత్,సిబ్బంది తిరుపతి, రాజేష్, శ్రీనివాస్, ఉమపతి, శ్రీనివాస్, మహిపాల్,శివ ఉన్నారు.

# ఘనంగా ముగిసిన ఎంసీసీపీఎల్ సిజన్-8 క్రికెట్ టోర్నమెంట్..

**బలగం టివి, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్లలోని కళాశాల మైదానంలో గత 45 రోజులుగా ఉత్సాహంగా సాగిన ఎంసీసీపీఎల్ సీజన్–8 క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. విజేతలకు బహుమతులను దార అశోక్ చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్, సిరిసిల్ల స్పాన్సర్ చేయగా , గెలిపిందిన విజేత భార్గవ్ టీమ్,రన్నర్ కప్ ను నరేష్ టీమ్ లకు బహుమతులను మాజీ కౌన్సిలర్ దార లావణ్య అశోక్ అందజేశారు. ఈ సందర్భంగా దార లావణ్య అశోక్ మాట్లాడుతూ, క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. యువతను ప్రోత్సహించడం తమకు గర్వకారణమని పేర్కొన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రముఖులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. టోర్నమెంట్లో పాల్గొన్న క్రీడాకారులందరినీ అభినందించారు.



# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే



**-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 29 ఫిర్యాదులు స్వీకరణ..**

**-జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టివి, రాజన్న సిరిసిల్ల**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే ఐపీఎస్ తెలిపారు. గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 29 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## అధైర్య పడకండి అండగా మేమున్నాం..

**-సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మూడు రోజుల వ్యవధిలో తండ్రి ఎస్.కె. గూడుమియా, కొడుకు కలీం అనారోగ్యంతో మరణించడంతో విషాదంలో మునిగిన కుటుంబాన్ని సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి పరామర్శించారు. వారిని పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించారు. 'ధైర్యం కోల్పోవద్దు, మేము మీకు అండగా ఉంటాం' అని భరోసా ఇచ్చి, వారికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.





# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే**

**బలగం టీవి,రాజన్న సిరిసిల్ల**

వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి సిరిసిల్లలోని మానేరు తీరంలోని ప్రేమ్ నగర్, బ్రిడ్జి వద్ద చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఎస్పీ మహేష్ బి గితే పలు శాఖల అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీమహేష్ బి గితే మాట్లాడుతూ వినాయక మంటపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని,ప్రజా ప్రతినిధులు, యువత ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్ళి, వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. వినాయక నిమజ్జనానికి కావలసిన నీటి సౌకర్యం, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య పనులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డి.ఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, నీటి పారుదల శాఖ అధికారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు నేతన్న పొదుపు డబ్బుల పంపిణీ..

**-12 మందికి రూ. 60 లక్షల నేతన్న బీమా మంజూరు**

**బలగం టివి,రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల వస్త్ర, చేనేత పరిశ్రమ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటూ ముందుకు వెళ్తున్న రాష్ట్ర ప్రభుత్వం కార్మిక కుటుంబాలకు వివిధ పథకాల లబ్ధి వారికి అందించేందుకు ఏర్పాటు చేసింది. నేతన్న పొదుపు, నేతన్న బీమా, చేనేత సంఘాలకు రుణాలు రెన్యువల్ చేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. నేతన్న పొదుపు(త్రిఫ్ట్) కింద మూడు సంవత్సరాల కాలానికి సంబంధించి రాష్ట్రంలోని వస్త్ర పరిశ్రమకు చెందిన కార్మికులకు రూ. 68 కోట్ల 14 లక్షలు, జిల్లాలో నేతన్న పొదుపు కింద నమోదు అయి వాటా ధనం చెల్లించిన 4,963 మంది వస్త్ర పరిశ్రమ కార్మికులకు రూ. 24 కోట్ల 80 లక్షలు,అలాగే నేతన్న బీమాలో నమోదై మరణించిన 12 మంది కార్మిక కుటుంబాల నామినీలకు ఒక్కొకరికి రూ. ఐదు లక్షల చొప్పున మొత్తం రూ. 60 లక్షలు మరియు రెండు చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ కింద రుణాలు రెన్యువల్ చేసే పత్రాలను రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం బై పాస్ రోడ్డులోని కే కన్వెన్షన్ హాల్ లో మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.



# మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలపై బీజేపీ నిరసన..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బిజెపి నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణ బిజెపి అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ మాట్లాడుతూ, మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణలో బిజెపి గెలుపులను అపహాస్యం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుమాల శ్రీకాంత్ ఆరోపించారు. బిజెపి నాయకుడు బండి సంజయ్ గురించి తప్పుడు ఆరోపణలు చేస్తూ, రాజకీయ ప్రయోజనాల కోసం కులమతాలను ప్రస్తావించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో గెలిచిన అసెంబ్లీ స్థానాలు కూడా దొంగ ఓట్లతో గెలిచారా అని ఆయన ప్రశ్నించారు.భవిష్యత్తులో మహేష్ కుమార్ గౌడ్ ఇలాంటి అసత్య వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బిజెపి ప్రజాస్వామ్య విలువల కోసం, తెలంగాణ ప్రజల స్వాభిమానం కోసం పోరాడుతుందని, కాంగ్రెస్ పార్టీ అబద్ధాలకు ప్రజలు తగిన జవాబు చెబుతారని దుమాల శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మ్యాన రాంప్రసాద్, దాసరి శ్రీనివాస్, కర్నే హరీష, ల్యాగల భాగయ్య, మోర శ్రీహరి, పల్లికొండ నరసయ్య, మోర రవి, మెరుగు శ్రీనివాస్, కొండ నరేష్, వడ్నాల శేఖర్, సిద్ధి దేవరాజ్, వెలిశాల అభినయ్, కొండ ప్రతాప్ బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పసిడి పతకంతో మెరిసిన మీరాబాయి

- **కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం**

**బలగం టీవీ, అహ్మదాబాద్**

భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చానూ మరోసారి తన ప్రతిభను చాటింది. టోక్యో ఒలింపిక్స్‌లో కంచు సాధించిన ఆమె, ఈసారి కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకం గెలిచి క్రీడాభిమానులను ఉర్రూతలూగించింది. సోమవారం జరిగిన 48 కిలోల విభాగం ఫైనల్లో 193 కిలోలు ఎత్తి మీరా గోల్డ్ మెడల్ కొల్లగొట్టింది. పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశ చెందాక ఏడాది కాలంగా పోటీలకు దూరంగా ఉన్న మీరా, ఈసారి తిరిగి బరిలోకి దిగింది. తొలి ప్రయత్నంలో 84 కిలోలు, రెండోసారి 109 కిలోలు ఎత్తి తన అజేయ శక్తిని చాటింది.

"సొంత గడ్డపై గెలిచిన ఈ స్వర్ణ పతకం నాకు ఎంతో ప్రత్యేకం. పారిస్‌లో ఎదురైన నిరాశ తర్వాత ప్రేక్షకుల మద్దతుతో మళ్లీ రాణించగలగడం గర్వంగా ఉంది. నా కోచ్ సూచనలు, దేశ ప్రజల ప్రోత్సాహమే ఈ విజయానికి కారణం. అక్టోబర్‌లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌కు మరింత ఉత్సాహంతో సన్నద్ధమవుతున్నాను. భారత జెండా ఎగురవేయడం నా లక్ష్యం" అని మీరాబాయి చానూ వ్యాఖ్యానించింది. 2018 నుంచి 49 కిలోల విభాగంలో పోటీపడుతున్న మీరా, పారిస్ ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంతో ఆగిపోవాల్సి వచ్చింది. దాంతో తిరిగి 48 కిలోల విభాగంలో బరిలోకి దిగిన ఆమె అంచనాలకు మించి రాణించింది. ఈ విభాగంలో మలేషియా క్రీడాకారిణి ఇరెనే హెన్రీకి రజతం, వేల్స్‌కు చెందిన నికోలే రాబర్ట్స్‌కు కాంస్యం దక్కింది.

# యూఎస్ ఓపెన్ రసవత్తర ఆరంభం







- **జొకోవిచ్, సబలెంకా, పాలోని విజయం**
- **మెద్వెదెవ్‌కు తొలి రౌండ్‌లోనే షాక్**

**బలగం టీవీ, న్యూయార్క్**

సీజన్‌లో నాలుగో గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ ఆదివారం రాత్రి భారత కాలమానం ప్రకారం రసవత్తరంగా మొదలైంది. కెరీర్ 25వ టైటిల్‌పై కన్నేసిన సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ తొలి రౌండ్‌లోనే అదరగొట్టాడు. అమెరికాకు చెందిన లెర్నర్ టైన్‌పై జొకో 6-1, 7-6 (7/3), 6-2తో వరుస సెట్లలో గెలుపొందాడు.

మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ అరీనా సబలెంకా 7-5, 6-1తో స్విట్జర్లాండ్ ఆటగాళ్ల మసరొవపై అలవోక విజయాన్ని సొంతం చేసుకుంది. ఇటలీకి చెందిన ఏడో సీడ్ జాస్మిన్ పాలోని 6-2, 7-6 (7/4)తో ఆస్ట్రేలియా ఆటగాళ్ల డెస్టానీ ఐవను ఓడించి రెండో రౌండ్‌లోకి అడుగుపెట్టింది.

**మెద్వెదెవ్‌కు షాక్ ఓటమి**

మాజీ చాంపియన్ డేనియల్ మెద్వెదెవ్‌కు మాత్రం తొలి రౌండ్‌లోనే పెద్ద షాక్ ఎదురైంది. ఫ్రాన్స్ ఆటగాడు బెంజిమిన్ బొంజితో జరిగిన ఐదు సెట్ల హెూరాహెూరీ మ్యాచ్‌లో మెద్వెదెవ్ 3-6, 5-7, 7-6 (7/5), 6-0, 4-6తో ఓటమిపాలయ్యాడు. మ్యాచ్ మధ్యలో అంపైర్‌తో వాగ్వాదం, ప్రేక్షకుల వైపు అభ్యంతరకర సంజ్ఞలు చేయడం, చివర్లో రాకెట్‌ను నేలకేసి బాదడం అతడి ప్రవర్తనపై తీవ్ర విమర్శలకు దారితీసింది.

**అమెరికా ఆటగాళ్ల దూసుకుపోవు**

పురుషుల సింగిల్స్‌లో అమెరికా ఆటగాళ్లు బెన్ షెల్టన్, టేలర్ ఫ్రిట్జ్ రెండో రౌండ్‌కు అర్హత సాధించారు. మహిళల సింగిల్స్‌లో జెస్సికా పెగులా, క్రెజికోవా, ఎమ్మా రడుకాను, విక్టోరియా అజరెంకా తదుపరి రౌండ్‌లోకి చేరారు.

## ఏపీ సీఎం సహాయనిధికి చిరంజీవి కోటి విరాళం

### సీఎం చంద్రబాబుకు స్వయంగా చెక్కు అందజేత



**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి తోడ్పాటుగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి కోటి రూపాయల విరాళం అందించారు. సోమవారం సీఎం చంద్రబాబును స్వయంగా కలిసిన చిరంజీవి, ఈ విరాళానికి సంబంధించిన చెక్కును ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ "ప్రకృతి విపత్తులు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులను ఆదుకునేందుకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుంది. నేను చేసిన ఈ చిన్న సహాయం ప్రజలకు మేలు చేస్తుందని ఆశిస్తున్నాను" అని తెలిపారు. చిరంజీవి అందించిన సాయం పట్ల సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలియజేశారు. "చిరంజీవి ఎప్పుడూ సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం ఇస్తారు. సేవా కార్యక్రమాలలో ఆయన చూపుతున్న కృషి ప్రశంసనీయం" అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.



## అవును అర్జున్ టెండూల్కర్‌కు నిశ్చితార్థం నిజమే

- **సచిన్ టెండూల్కర్ ధృవీకరణ**

**బలగం టీవీ, ముంబై**

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తన కుమారుడు అర్జున్ టెండూల్కర్ నిశ్చితార్థాన్ని అధికారికంగా ధృవీకరించారు. అర్జున్, సానియా చందోక్‌తో సన్నిహిత బంధువులు, స్నేహితుల సమక్షంలో సాదాసీదాగా జరిగిన కార్యక్రమంలో నిశ్చితార్థం చేసుకున్నాడు. సానియా చందోక్ ప్రముఖ వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలు. వారి కుటుంబం ముంబయిలో హాస్పిటాలిటీ, ఫుడ్ ఇండస్ట్రీలో పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తోంది. ఇంటర్‌కాంటినెంటల్ హెూటల్, బ్రూక్లిన్ క్రీమరీ ఐస్‌క్రీమ్ బ్రాండ్ వంటి వ్యాపారాలు వారికి చెందినవే.

గత కొన్ని రోజులుగా భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ రహస్యంగా నిశ్చితార్థం ఫొటోలు మీడియాలో వైరలవుతున్నాయి. అయితే.. ఈ వ్యవహారంపై సచిన్ నేరుగా ప్రకటన చేయకపోవడంతో ఇదంతా నిజమా?.. కేవలం వందతులేనా? అని సందేహాలు వెలిబుచ్చారు పలువురు నెటిజన్లు. తమ వారసుడి పెళ్లి ఫిక్స్ అయిందని వస్తున్న వార్తలపై ఎట్టకేలకు సచిన్ మౌనం వీడాడు. ఒక యూజర్ ప్రశ్నకు బదులిస్తూ 'అవును.. మా అబ్బాయికి ఎంగేజ్‌మెంట్ అయింద'ని స్పష్టం చేశాడు. ఈ నేపథ్యంలో తమ కుటుంబ విషయాన్ని రాద్ధాంతం చేయడం ఇష్టంలేని సచిన్ సోమవారం రిప్లై ఇచ్చాడు. క్రైండ్ ఫ్లమ్ 169 అనే యూజర్ అనుమానాన్ని నివృత్తి చేస్తూ.. అవును.. మా అబ్బాయి అర్జున్‌కు ఎంగేజ్‌మెంట్ అయింది. అతడి జీవితంలో కొత్త దశ మొదలుకాబోతున్నందున మేమంతా చాలా థ్రిల్ అవుతున్నాం అని మాస్టర్ బ్లాస్టర్ కామెంట్ చేశాడు. దాంతో.. సదరు యూజర్‌కే మాత్రమే కాదు చాలామందికి అనుమానం తీరిపోయింది. సచిన్ ధ్రువీకరించడంతో కాబోయే జంటకు శుభాకాంక్షలు అని పోస్టులు పెడుతున్నారు చాలామంది.



## కేజీఎఫ్ నటుడు కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**

చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. కేజీఎఫ్ సినిమాలో బాంబే డాన్ శెట్టి పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకున్న కన్నడ నటుడు దినేష్ మంగళూరు (63) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. మంగళవారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దినేష్ మంగళూరు మరణ వార్త తెలిసి సినీ ప్రముఖులు, అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

నటుడిగానే కాకుండా దినేష్ దాదాపు 200 చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా సేవలందించారు. వీర మదకరి, చంద్రముఖి ప్రాణసకి, రాక్షస వంటి పలు హిట్ సినిమాల్లో ఆయన చేసిన ఆర్ట్ డైరెక్షన్ ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. సినిమా రంగానికి ఆయన అందించిన సేవలు మరువలేనివని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.




## విడుదలకు సిద్ధమైన 'సుందరకాండ'

### సెన్సార్ పూర్తి

### వినాయక చవితి కానుకగా రేపు ప్రేక్షకుల ముందుకు

**బలగం టీవీ, హైదరాబాద్**

యంగ్ హీరో నారా రోహిత్ నటించిన తాజా చిత్రం 'సుందరకాండ' విడుదలకు సిద్ధమైంది. ఇటీవలే ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుని U/A సర్టిఫికేట్ పొందింది. దీంతో సినిమా రిలీజ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రోహిత్ కెరీర్‌లో మరో కీలక మలుపుగా నిలుస్తుందని చిత్ర బృందం నమ్మకం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తున్నాయి.

చిత్ర యూనిట్ తాజాగా రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేసింది. వినాయక చవితి కానుకగా ఆగస్టు 27న 'సుందరకాండ' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో శ్రీదేవి విజయ్‌కుమార్, విర్తి వాఘని హీరోయిన్లుగా నటించగా, వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహించారు. న్యూ-ఏజ్ కథ, ఎమోషనల్ టచ్ కలగలిపి ప్రేక్షకులకు కొత్త అనుభూతి అందిస్తుందని చిత్ర యూనిట్ చెబుతోంది.

## ఓటీటీలోకి విజయ్ దేవరకొండ 'కింగ్డమ్'

### ఆగస్టు 27 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్




**బలగం టీవీ, హైదరాబాద్**

విజయ్ దేవరకొండ నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ 'కింగ్డమ్' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో విడుదలై మంచి స్పందన అందుకున్న ఈ చిత్రం త్వరలోనే ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుంది. నెట్‌ఫ్లిక్స్ తమ సోషల్ మీడియా వేదికల ద్వారా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ఈ నెల ఆగస్టు 27 నుంచి 'కింగ్డమ్' స్ట్రీమింగ్ కానుందని తెలిపింది. జులై 31న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, నెల రోజులు పూర్తికాకముందే ఓటీటీకి వస్తుండటం విశేషం. దీంతో థియేటర్లలో చూడలేకపోయిన అభిమానులకు ఇంట్లోనే చూసే అవకాశం లభిస్తోంది.

## మళ్లీ మొదలైన 'ది రాజా సాబ్' షూటింగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ దర్శకుడు మారుతి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న హారర్ కామెడీ చిత్రం 'ది రాజా సాబ్'. ఈ సినిమా షూటింగ్‌ను శనివారం హైదరాబాద్‌లోని అజీజ్ నగర్లో తిరిగి ప్రారంభించారు. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ స్వయంగా పాల్గొంటున్నట్టు సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న ఈ షెడ్యూల్ అనంతరం సెప్టెంబర్ 17 నుంచి కేరళలో ప్రభాస్ ఇంట్రొడక్షన్ సాంగ్ను చిత్రీకరించనున్నారు. ఆ తర్వాత గ్రీస్‌లో మరో రెండు పాటలను తెరకెక్కించనున్నట్టు మేకర్స్ తెలిపారు. వీటితో సినిమా షఉటింగ్ పూర్తవుతుందని చిత్ర బృందం వెల్లడించింది.